క్లుప్తంగా

వాటర్‌ప్లాంట్ తెరిపించాలి



జనగామ రూరల్: మండలంలోని మరిగడి గ్రామంలో గత కొంత కాలంగా పని చేయకుండా నిలిచిపోయిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను తెరిపించాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దార్ జగన్‌కు గ్రామస్తులు యూత్ సభ్యులు శనివారం వినతిపత్రం అందజేశారు. వాటర్ ప్లాంట్ లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. పరిసర ప్రాంతాల బావుల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు.వినతిపత్రం ఇచ్చిన వారిలో చామకూర చిరంజీవి, కమలాకర్, బాల్నె కుమార్, అశోక్, మధు, రాజశేఖర్, ప్రవీణ్, రాజు, వంశీ తదితరులు ఉన్నారు.

గీతకార్మికుడికి తీవ్రగాయాలు

పాలకుర్తి: మండలంలోని మల్లంపల్లిలో తాటి చెట్టుపై నుంచి జారిపడి కిందపడడంతో గీత కార్మికుడికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నా యి. రోజు మాదిరిగా గ్రామానికి చెందిన కోతి అనిల్ కల్లు కోసం తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హనుమకొండలోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా మోకు దెబ్బ రాష్ట్ర నాయకుడు పోశాలు వెంకన్న మాట్లాడుతూ ప్రభుత్వం గీత కార్మికుడికి వైద్య సదుపాయం అందించి ఆదుకోవాలని కోరాడు.

పరామర్శ



పాలకుర్తి టౌన్: పాలకుర్తిలో ఇటీవల మృతి చెందిన గుంజె యాదగిరి కుటుంబాన్ని శనివారం మాజీ వార్డు సభ్యుడు వీరమనేని హన్మంతరావు పరామర్శించాడు. అనంతరం బాధిత కుటుంబానికి బియ్యం అందజేశాడు.

అనాథ వృద్ధులకు పండ్ల పంపిణీ



దేవరుప్పుల : మండలంలోని సీతారాంపురం ప్రేమసదన్ శరణాలయంలో అనాథ వృద్ధుల మధ్య కాంగ్రెస్ యువజన నాయకుడు ఉప్పల ప్రకాశ్ జన్మదిన వేడుకలు నిర్వహించుకొని పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడంబరాలకు తావివ్వకుండా ఇలాంటి నిరాశ్రయుల మధ్య పుట్టిన రోజు వేడుకలు నిర్వహించుకోవడం సంతృప్తినిచ్చిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు తోటకూరి రమేశ్, గొడిశాల శ్రీను, ఫత్తేపురపు శేఖర్, ఆకుల సంతోష్, జోగు నవీన్, చింత అనిల్, ఉపేందర్, ఉప్పల సిద్దు, చింత పవన్, సాయి, అభి, ఉమేష్, ఈశ్వర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వార కల్యాణం



చిల్పూరు: శ్రీ బుగులు వేంకటేశ్వరాలయంలో శనివారం అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల ఆధ్వర్యాన స్వామివారికి వార కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈఓ లక్ష్మీప్రసన్న, దాతలు మాలోతు రాజు–శ్రవంతి, తాళ్లపల్లి ప్రవీణ్, సంగోజు మోహనాచారి–శంకర్‌లక్ష్మి, ఉత్సవ కమిటీ చైర్మన్ మామిడాల యాదవరెడ్డి, సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

రఘునాథపల్లి: సీజనల్ వ్యాధులు ప్రబలనున్న నేపథ్యంలో పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవని తెలంగాణ సాంస్కృతిక కళాకారులు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో కళాజాత నిర్వహించారు. తమ కళా ప్రదర్శన ద్వారా పరిసరాల పరిశుభ్రతతో కలిగే ప్రయోజనాలు వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో టీం లీడర్ తిప్పర్తి శ్రీనివాసులు, కళాకారులు గద్దర్ సాంబయ్య, గడిపె బాలయ్య, బావండ్లపల్లి చిరంజీవి, ముక్కెర సంపత్‌కుమార్, ఎడవల్లి విజయ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలకు బాసటగా నిలుద్దాం

- గ్రామ సభలతో పేదలకు 'డబుల్' ఇళ్లు కేటాయించాలి
- వాగు పరీవాహక ప్రాంతాల్లో ఇసుక తరలింపును నిషేధించాలి
- ఎంపీపీ సావిత్రి, జెడ్పీటీసీ భార్గవి



మండల సభలో మాట్లాడుతున్న ఎంపీపీ సావిత్రి

దేవరుప్పుల : మండల సమగ్రాభివృద్ధిలో భాగస్వామ్యులైన ప్రజాప్రతినిధులు భవిష్యత్‌లో అన్నదాతల సమస్యల పరిష్కారంలో రాజకీయాలకతీతంగా నిత్యం బాసటగా నిలుద్దామని ఎంపీపీ బస్వ సావిత్రి, జెడ్పీటీసీ పల్ల భార్గవి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన చివరి మండల సర్వసభ్య సమావేశంలో వారు ఉద్వేగభరితంగా మాట్లాడారు. మాజీ మంత్రి దయాకర్‌రావు నేతృత్వంలో తాము ప్రజాప్రతినిధులమై పలు రంగాల అభివృద్ధి పురోగతికి పాటు పడ్డామన్నారు. గత ప్రభుత్వాలతో పోల్చుకుంటే బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే మండల పరిధిలో భూగర్భ జలాల పెంపునకు వాగులపై చెక్‌డ్యామ్‌లు, అంతర్గత రోడ్లు, పురవీధుల్లో సీసీ రోడ్లు, మురికి కాలువలు, పల్లెల ప్రగతికి చిహ్నాలైన ప్రకృతి వనాలు, నర్సరీలు, పారిశుద్ధ్య నివారణకై తలపెట్టిన డంపింగ్ యార్డులు, శ్మశానవాటికలు విరివిగా నిర్మించేలా తోడ్పాటు అందించామన్నారు. తాము ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన నాటికి 18 జీపీలు కలిగి ఉన్న తరుణంలో దయాకర్‌రావు సహకారంతో 32 జీపీలుగా విస్తరింపజేసి గిరిజన తండాలకు స్వపరిపాలన అందించామన్నారు. ఇలాంటి పురోగతికి వెన్నంటి ఉండి తమతోపాటు తోడ్పాటు అందించిన అధికార యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా శాఖల పనితీరుపై సమీక్ష జరిపారు. ప్రధానంగా వాగు పరీవాహక ప్రాంతాల్లో వ్యవసాయ సాగుకు తీవ్ర విఘాతం కలిగే ఇసుక తరలింపు నిషేధించాలని పలువురు ఎంపీటీసీలు ప్రస్తావించగా ప్రస్తుతం అనుమతులు ఇచ్చిన గొల్లపల్లి, రంబోజీగూడెంలో ఇసుక రవాణా నిలువరిస్తూ భవిష్యత్‌లో నిషేధించాలని మండల సభ ఏకగ్రీవ తీర్మానం చేసింది. అలాగే గత ప్రభుత్వం హయాంలో నిర్మితమైన డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లను సత్వరమే గ్రామసభలు నిర్వహించి అర్హులైన పేదలకు ఇవ్వాలని తీర్మానం చేశారు. చిన్నమడూరులో మూడు దశాబ్దాల కిందట ఇల్లు నిర్మించుకొని గ్రామ పంచాయతీల్లో క్రమబద్ధీకరించినప్పటికీ సదరు పాత భూ యజమాని వారసత్వ కుటుంబ సభ్యులకు మూడెకరాల పైచిలుకు భూమికి రైతుబంధు అమలు చేయడం నిలువరించాలని ఎంపీటీసీ గొడుగు సుజాత ఆరోపించగా రెవెన్యూ అధికారులకు సిఫారసు చేసి చర్యలు తీసుంటామన్నారు. మండలంలో 50 ఎకరాల్లో 90 శాతం సబ్సిడీతో పండల తోటల పెంపకానికి కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. మండల సభలకు స్థానిక ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని ఆహ్వానించగా చివరిసభకు సైతం గైర్హాజర్ కావడంతో పాటు మండల సభకు ఉన్నతాధికారులు ఎవరు రాకపోవడం తీరుపై ప్రజాప్రతినిధులు విస్మయం వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీడీఓ కె లక్ష్మీనారాయణ, ఎంపీఓ టి సురేష్‌కుమార్, వైస్‌ఎంపీపీ కత్తుల విజయ్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్య పరిష్కరించేలా కృషి చేస్తాం

- ఆర్‌డీఓ డీఎస్ వెంకన్న



15వ వార్డులో కాలనీవాసులతో మాట్లాడుతున్న ఆర్‌డీఓ వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్‌లో డ్రెయినేజీ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి పూర్తిస్థాయిలో పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకుంటామని ఆర్‌డీఓ, ఘన్‌పూర్ ప్రత్యేక అధికారి డీఎస్ వెంకన్న అన్నారు. ఘన్‌పూర్‌లో 15, 16వ వార్డులో ఏళ్ల తరబడి నెలకొన్న డ్రెయినేజీ సమస్యపై కాలనీవాసులు అందించిన ఫిర్యాదు మేరకు ఆర్‌డీఓ స్వయంగా శనివారం ఆయా వార్డులను సందర్శించారు. వార్డులలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడాన్ని గమనించి కాలనీవాసులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దిగువ ప్రాంతం కావడంతో వర్షాకాలంలో పట్టణంలోని డ్రెయినేజీ నీరంతా వచ్చి ఇక్కడే నిలుస్తుందని, దాంతో కాలనీ మురుగునీటి కుంటలుగా మారుతుందని కాలనీవాసులు తెలిపారు. దుర్వాసన, పందులు, దోమలతో తీవ్ర ఇబ్బందిగా ఉందని, ప్రతీ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులతో పడరాని పాట్లు పడుతున్నామని వాపోయారు. స్పందించిన ఆర్‌డీఓ వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. 15, 16వ వార్డుల్లో డ్రెయినేజీ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైన చోట మురుగుకాల్వల నిర్మాణం చేసి జనవాసాల మధ్య మురుగునీరు నిలవకుండా సత్వరచర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మేజర్ గ్రామపంచాయతీ, డివిజన్ కేంద్రమైన ఘన్‌పూర్ సమగ్రాభివృద్ధికి ప్రత్యేక చొరవతో పనిచేస్తామని, గ్రామస్తులు సంయమనంతో సహకరించాలని కోరారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కరణ్, ఎంపీటీసీ గన్ను నర్సింహులు, ఎంపీడీఓ ఉమాదేవి, ఈఓ సత్యనారాయణ, నాయకులు చింత ఎల్లయ్య, సింగపురం వెంకటయ్య, సిరిగిరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులు ముమ్మరం



మరమ్మతు పనులను పర్యవేక్షిస్తున్న డీఈ హుస్సేన్‌నాయక్

స్టేషన్‌ఘన్‌పూర్ : ప్రతీ 25 ఏళ్లకొకసారి విద్యుత్ సబ్‌స్టేషన్లలో చేపట్టే మరమ్మతు పనులను ఘన్‌పూర్‌లోని 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ముమ్మరంగా సాగాయి. ఎన్‌పీడీసీఎల్ డీఈ ఎం.హుస్సేన్‌నాయక్ పర్యవేక్షణలో విద్యుత్ అధికారులు, సిబ్బంది పనులు చేపట్టారు. సబ్‌స్టేషన్‌లో గతంలో ఉన్న రాబిట్ కండక్టర్‌ను మార్చి మూస్ కండక్టర్‌ను ఏర్పాటు చేశారు. ఘన్‌పూర్ 132/33 కేవీలో 2000 సంవత్సరంలో వేసిన పాత వైర్ల స్థానంలో అధిక సామర్థ్యం ఉన్న నూతన వైర్లను వేయడంతో పాటు 800ఏ బస్‌కప్లర్ ఏబీ స్విచ్ స్థానంలో 1200ఏ బస్ కప్లర్ స్విచ్‌ను అమర్చారు. అయితే ముందస్తు ప్రకటించినట్లుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా మరమ్మతు పనులను విజయవంతంగా చేపట్టినట్లు డీఈ తెలిపారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జీపీ కార్మికుల నిరసన



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న జీపీ కార్మికులు

స్టేషన్‌ఘన్‌పూర్: రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ పారిశుద్ధ్య, గ్రామ పంచాయతీ కార్మికులు మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఈఓకు, గ్రామ ప్రత్యేక అధికారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఘన్‌పూర్ జీపీ కార్మికుల సంఘం అధ్యక్షుడు బోసు రాజు, ఉపాధ్యక్షుడు కుంభం రాజు మాట్లాడుతూ దాదాపు ఇరవై ఏళ్లుగా జీపీ కార్మికులుగా పనిచేస్తున్నామని, తమ సమస్యలపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గత రెండు నెలలుగా వేతనాలు రావడం లేదని, దాంతో పూట గడవడం కష్టం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఈఓను, గ్రామ ప్రత్యేక అధికారి అయిన ఆర్‌డీఓను కలిస్తే నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని, బిల్లు పెట్టామని, ప్రభుత్వం నుంచి రాగానే అందిస్తామని చెబుతున్నారన్నారు. నిరసనలు, ధర్నాలు చేస్తే పనిలో నుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నారని వాపోయారు. తమ న్యాయమైన హక్కుల కోసం నిరసన చేయడం తప్పా అన్నారు. వేతనాలు చెల్లించని పక్షంలో కార్మికులమంతా ఐక్య పోరాటాలు చేస్తామని, అవసరమైతే విధులు బహిష్కరిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికులు సింగపురం చంద్రమౌళి, నీల శ్రీను, నక్క శ్రీను, ఎడ్ల రాజు,వెంకటయ్య, స్వరూప, మేడ కోమల, ఎస్.సారయ్య, ప్రమోద్, రమేష్, గజేందర్, విజయ్, వెంకటస్వామి పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



చిల్పూరు: అంగన్‌వాడీలకు వచ్చే చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డాక్టర్ ఆంజనేయులు అన్నారు. మండలంలోని నష్కల్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో రాష్ట్రీయ బాల స్వాస్థ కార్యక్రమంలో భాగంగా శనివారం ఐసీ డీఎస్ మండల సూపర్‌వైజర్ దూలమ్మ ఆధ్వర్యంలో పిల్లల బరువు, ఎత్తు, ఆరోగ్యంపై డా క్టర్లు మౌనిక, ఆంజనేయులు పరీక్షలు నిర్వహించారు. ఇక ప్రతీ నెలలో ఏదో ఒక వారంలో ప్రతి అంగన్‌వాడీ సెంటర్లను సందర్శిస్తారని వాళ్లు కూడా పిల్లల ఆరోగ్యం గూర్చి తెలుసుకుంటారని దూలమ్మ తెలిపారు. అన్ని కేంద్రాల్లో బాలామృతం అందుబాటులో ఉందని తెలి పారు. ప్రియదర్శిని పాల్గొన్నారు.

ఎంపీ,ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ నాయకులు



ఎంపీ కావ్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జగదీష్‌చందర్‌రెడ్డి, తదితరులు

రఘునాథపల్లి: మండలంలోని కాంగ్రెస్ సీనియర్ నాయకులు శనివారం ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్యలను మర్యాద పూర్వకంగా కలిశారు. శనివారం హనుమకొండలోని కడియం నివాసంలో నూతనంగా ఎన్నికైన ఎంపీ కావ్యను సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రధాన సమస్యలు ఎమ్మెల్యే కడియం దృష్టికి తీసుకెళ్లారు. మండలంలోని సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని ఎమ్మెల్యే కడియం తెలిపినట్లు పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే, ఎంపీలను కలిసిన వారిలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు మేకల నరేందర్, గాదె రమేష్, లింగాల సుభాష్‌చందర్‌రెడ్డి, గుగులోతు కొమురెల్లి, కొలిపాక మల్లేష్, తోటకూరి రమేష్, బిర్రు మధు, రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ప్రైవేట్‌లో అధిక ఫీజులు నియంత్రించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాశ్

జనగామ రూరల్: ప్రైవేట్ పాఠశాల, కళాశాలల్లో అధిక ఫీజలను నియంత్రించాలని విద్యాహక్కు చట్టం పకడ్బందీగా అమలు చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కళ్యాణ లింగం అధ్యక్షతన ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేట్ స్కూల్స్ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని అన్నారు. ఫీజుల పేరుతో నర్సరీ నుంచి బుక్స్, యూనిఫామ్స్ విచ్చల విడిగా అమ్మకాలు చేస్తున్నారని అన్నారు. ఫిట్‌నెస్ బస్సులు మాత్రమే వాడుకలో ఉండాలని తెలిపారు. పాఠశాలలు, కళాశాల ముందు ఫీజు బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. చట్టంప్రకారం 25 శాతం పేద వారికి రాయితీ ఇవ్వాలని ఎస్సీ, ఎస్టీలకు, మైనార్టీలకు ఉచిత విద్య అందించాలన్నారు. గోపి, వెంకటేష్, అబ్రహం, జయ, రజిత, సుధాకర్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

సంత హక్కుల వేలం



బచ్చన్నపేట : మండల కేంద్రంలోని వారాంతపు సంతలో వివిధ హక్కుల కోసం వేలం పాటలను నిర్వహించామని జిల్లా వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో వేలం పాటలను నిర్వహించిన అనంతరం వారు మాట్లాడారు. ఈ వేలం పాటల కాలపరిమితి ఒక ఏడాది పాటు ఉంటుందని పశువుల రహదారి మండల కేంద్రానికి చెందిన బొడిగం వెంకట్‌రెడ్డి వేలం ద్వారా రూ. 3.89 లక్షలు, డక్కా తేలు అంజయ్య రూ.16వేలు పాడి వేలంను దక్కించుకున్నారని అన్నారు. సరైన వేలం పాట రానందున తైబజార్ వేలంను వాయిదా వేశామని, మళ్లీ వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఘురామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి అనిల్‌రాజ్, చక్రధర్, పాల్గొన్నారు.

భగీరథ సర్వేలను వేగవంతం చేయాలి



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రఘురామకృష్ణ

బచ్చన్నపేట : మండలంలోని అన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ల వివరాల కోసం ఇంటింటా సర్వేలను పంచాయతీ కార్యదర్శులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి సర్వేలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అందరికి భగీరథ నల్లా కనెక్షన్లు ఉన్నా యా, ఉంటే నీరు ఎలా వస్తుందని తెలుసుకోవాలన్నారు. గతంలో బిగించిన నల్లా కనెక్షన్ల ప్రకారమే గ్రామాల్లో వాటర్‌ట్యాంక్‌లను నిర్మించారని ప్రస్తుత సర్వేల ఆధారంగా కనెక్షన్లు పెరిగే నీటి సామర్థ్యంను అంచనా వేస్తారని తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు, జీపీ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ



విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న దాతలు

జఫర్‌గఢ్: గ్రామీణ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను విద్యాపరంగా ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో నోట్ బుక్స్ పంపిణీ చేసినట్లు పాలకుర్తి మండలం చెన్నూరుకు చెందిన డాక్టర్ అజయ్ కుమార్–పద్మ దంపతులు అన్నారు. మండలంలోని కూనూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గర్ల్ చైల్డ్ డే ఆక్టివిట్స్ కార్యక్రమంలో భాగంగా శనివారం పాఠశాల హెచ్‌ఎం సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యాసంవత్సరానికి రూ. 25 వేల విలువతో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ తండ్రి శ్రీమహాభాష్యం చక్రవర్తుల రామానుజంకు పేద విద్యార్థులు చదువుకోవాలనే తపనతో ఇటువంటి కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. కార్యక్రమంలో ఇల్లందుల కుమార్, పల్లెపాలి మల్లారెడ్డి, అమ్మ ఆదర్శపాఠశాల కమిటీ చైర్మన్ మద్ది రాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి



బచ్చన్నపేట : గ్రామస్తులు గ్రామాభివృద్ధికి పాటుపడే అధికారులకు సహకరించాలని మండలంలోని గంగాపూర్ గ్రామప్రత్యేక అధికారి, మండల వ్యవసాయ అధికారి విద్యాకర్‌రెడ్డి అన్నారు. శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రజలు అందరూ తమ ఇంటి చుట్టూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అన్ని రకాల పన్నులను చెల్లిస్తూ సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



చెక్కును అందజేస్తున్న రజక సంఘం నాయకులు

జఫర్‌గఢ్: తెలంగాణ రజక సమితి మాజీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సాంబరాజు రవి ఇటీవల మృతి చెందగా వారి కుటుంబానికి రజక రిజర్వేషన్ సమితి ఆధ్వర్యంలో రూ.1 లక్ష ఆర్థికసాయం అందజేశారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన సాంబరాజు కుమార్తె భావన పేరు మీద పోస్టాఫీస్‌లో డిపాజిట్ ఫిక్స్ చేసి చెక్కును రాష్ట్ర అధ్యక్షుడు గోపి, కమిటీ సభ్యులు అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా సంఘం ఆధ్వర్యంలో రూ.1,00, 9725 రాగా చెక్కును పోస్టాఫీస్‌లో డిపాజిట్‌తో పాటు మిగిలిన రూ.9,725 భార్య దివ్యకు అందజేశారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ ఏ సంఘం చేయలేని విధంగా కృషి చేసి రాష్ట్ర వ్యాప్తంగా ఉండి సహాయ సహకారాలు అందించారని ప్రతి ఒక్కరికి వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చాకలి ఐలమ్మ మనుమడు రామచంద్రం, సంపత్, సీపీఎం నాయకులు రాపర్తి సోమయ్య, నేషనల్ దోబీ రిజర్వేషన్ సంఘ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఉల్లెంగుల యాదగిరి, రిజర్వేషన్ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాంబరాజు కుమార్, యగేంధర్, యా కన్న, నరేష్, రాములు ,రాజు, కిష్టయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి



నర్మెట : ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

నర్మెట : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని అందుకు ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని పలువురు ఉపాధ్యాయులు అన్నారు. శనివారం మండలంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు రామచెంద్రు తండా, మాన్సింగ్ తండా, దొంగచెలిమె తండాల్లో బడి బాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉత్తమ ఉపాధ్యాయులచే బోధన ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వాసు, హరిసింగ్, రవి, బిక్షపతి. పలువురు పాల్గొన్నారు.

పల్లగుట్టలో కోలాహలంగా బడిబాట



6వ తరగతిలో విద్యార్థులను చేర్చుకుంటున్న హెచ్‌ఎం నర్సింహారెడ్డి

చిల్పూరు: మండలంలోని పల్లగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం బడిబాట కార్యక్రమం కోలాహలంగా జరిగింది. ముందుగా ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి పూర్తి చేసుకుని 6వ తరగతిలో చేరుతున్న 18 మంది ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కేతిడి నరసింహారెడ్డి పండగ వాతావరణంలా ఏర్పాటు చేసి చేర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ఫత్తేపూర్, కృష్ణాజీగూడెం, పల్లగుట్ట గ్రామాలకు చెందిన 35 మంది విద్యార్థులు నూతనంగా చేరారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు నరసింహరావు, ప్రకాష్, సురేష్, మూల లక్ష్మి, చంద్రశేఖర్‌రెడ్డి, రమణ పాల్గొన్నారు.

కష్టపడే కార్యకర్తలకు తగిన గుర్తింపు



కేక్ కట్ చేస్తున్న బీజేపీ నాయకులు

జఫర్‌గఢ్: బీజేపీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందని ఇందుకు కేంద్రమంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి నిదర్శనం అని బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకోప్పుల నగేష్ అన్నారు. శనివారం మంత్రి కిషన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మండల కేంద్రంలో కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో తిరుపతి, యాకలక్ష్మి, పి.రాజు, రవి, యాకస్వామి, కవిత, శ్రీను, వెంకటయ్య, ప్రేమ్‌కుమార్, సంతోష్ పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వృద్ధుడి ఆత్మహత్య



భీమయ్య మృతదేహం

నర్మెట : కుటుంబ కలహాలతో ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని గుంటూరుపల్లిలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన జంజాల భీమయ్య (64) కూలీ పనులను చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇటీవల చిన్నకొడుకుతో కోడలు గొడవ పెట్టుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. కొడుకు ఒక్కడే ఉంటున్నాడు. అలాగే చిన్నకూతురు వివాహం కూడా చేయలేకపోతున్నాడు. వీటికి తోడు భీమయ్య ఆర్థిక పరిస్థితి కూడా సరిగా లేకపోవడంతో మనస్తాపం చెంది ఈ నెల 14న ఇంట్లో గడ్డి మందు తాగాడు. గమనించిన వారు జనగామ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. భీమయ్యకు భార్య లక్ష్మి, పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.